www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 12 | జూన్ | 2025 పేజీలు : 9

## తూకం లేకుండానే బియ్యం రవాణా..!



-నష్టపోతున్న డీలర్లు
-వంద క్వింటాలకు క్వింటా తక్కువ పంపిణీ
-కమిషన్ రాక కష్టాలు

2లో

## రెచ్చిపోతున్న
# రేషన్ మాఫియా..!



(ఫైల్)

-వైరాలో జోరుగా రేషన్ బియ్యం రీసైక్లింగ్
-స్థానిక మిల్లులకే విక్రయాలు
-రేషన్ షాపు టు రైస్ మిల్
-ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో తరలింపు
-సిఎంఆర్ రైతు స్థానంలో రేషన్ బియ్యం..?

ప్రజాపక్షం/వైరా : వైరాలో రేషన్ రీసైక్లింగ్ మాఫియా జోరుగా కొనసాగుతుంది. గత కొన్ని రోజులుగా పంపిణీ చేస్తున్న మూడు నెలలకు ఒకసారి రేషన్ బియ్యం పంపిణీ దళారులకు మిల్లర్లకు వరంగా మారింది. వైరాలోని కొన్ని రేషన్ షాపుల నుండి నేరుగా ప్రజాపంపిణీ బియ్యాన్ని స్థానికంగా ఉన్న మిల్లులకు తరలిస్తున్నారు. పేరు ప్రఖ్యాతిగాంచిన కొంతమంది మిల్లర్లు ఇటీవల కాలంలో ప్రభుత్వ ధాన్యాన్ని బదులుగా ఇచ్చే సిఎంఆర్ రైస్ కింద ఇచ్చేందుకు పెద్ద ఎత్తున

మిగతా 2లో..

# మోగనున్న బడి గంట..!





-నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం
-తొలి రోజే విద్యార్థులకు యూనిఫాం, బుక్స్ పంపిణీ
-176 పాఠశాలల్లో ఏఐ బోధన
-మూతపడిన పాఠశాలలను ప్రారంభించిన కలెక్టర్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : బడిగంట మోగనుంది. వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తొలి రోజునే విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేయనున్నారు. పాఠశాలలు పునః ప్రారంభం కానుండడంతో పాఠశాలలను ముస్తాబు చేస్తున్నారు. డిఈఓ సామినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాలను పటిష్టంగా చేపట్టారు. ఈ ఏడాది పాఠశాలల్లో పూర్తి స్థాయిలో వసతులు

మిగతా 2లో..

## చివరి ఆయకట్టు వరకు
# సాగునీరు అందించాలి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు సమన్వయంతో పని చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, ఆర్థిక సలహాదారు సంజీత్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

మిగతా 2లో..

-ప్రతి ఆవాసానికి స్వచ్ఛమైన తాగునీరు
-కేంద్ర మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సంజీత్
-జల్ జీవన్ ప్రాజెక్టులపై ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష

## కమ్యూనిస్టులతోనే
# హక్కుల సాధన

-బోనకల్ మండల మహాసభలో బాగం



ప్రజాపక్షం/ బోనకల్ : దేశంలో కార్మికులు, కర్షకులు ప్రజలకు హక్కులు సాధించి పెట్టడంలో కమ్యూనిస్టు పార్టీలు కీలక పాత్ర పోషించాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. బుధవారం సిపిఐ బోనకల్ మండల 17వ మహాసభ ముష్టికుంట్ల గ్రామంలో అమరజీవి జక్కా నాగభూషణం ప్రాంగణంలో ఆకిన పవన్, ఏలూరి రమేష్ ల అధ్యక్షతన జరిగింది. తొలుత మహాసభల ప్రారంభ సూచికంగా ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని బత్తినేని నీరజ ఆవిష్కరించారు. అమర వీరుల స్మారక స్తూపానికి పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ వందేళ్లుగా సిపిఐ, కమ్యూనిస్టు పార్టీలు దేశానికి ఏమి చేశాయని కొంత మంది అవివేకులు మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. భారతదేశ

మిగతా 2లో..

# రెచ్చిపోతున్న రేషన్ మాఫియా..!

(మొదటిపేజీ తరువాయి)
రేషన్ బియ్యాన్ని మిల్లర్లు దింపుకుంటున్నారు. ఈ క్రమంలో ధాన్యం ఇచ్చేనా దానికి బదులుగా ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యంలో రేషన్ బియ్యాన్ని జత చేసి పంపిస్తున్నారని తెలుస్తుంది. కొన్ని రేషన్ షాపులు వద్ద నేరుగా షాపుల నుండి స్కూటీలపై బైకులపై ఆటోల్లో బియ్యాన్ని తీసుకొని మిల్లర్లకు అందిస్తున్నారు. మిల్లర్లు ఆ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సిఎంఆర్ రైస్ క్రింద వాటిని బస్తాల్లో పెట్టి పంపిస్తున్నారు. అందించాల్సిన బియ్యాన్ని పంపించే క్రమంలో బస్తాలను కూడా తనిఖీ చేసిన సందర్భాలు కనపడలేదు. ఇటీవల కాలంలో ప్రజాపక్షంలో బియ్యంలో నాణ్యత పరిశుభ్రతలించేది ఎవరైనా శీర్షికను ప్రచురించడం కూడా జరిగింది. దీనిపై డిఎస్‌వో సీరియస్ అయి తాటిపూడి గౌడౌన్ వద్ద తనిఖీలు నిర్వహించి హద్దు మీరితే చర్యలు తప్పవని హెచ్చరికలు కూడా జారీ చేశారు. అయితే వైరాలోని ప్రముఖ మిల్లులకు ఈ రేషన్ బియ్యాన్ని జోరుగా తరపున చేస్తున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున కొన్ని వందల క్వింటాల బియ్యాన్ని ఆ మిల్లుకి తరలించారు అనే ఆరోపణ లేకపోలేదు. అసలు రేషన్ డీలర్లకు మిల్లర్లకు మధ్య కుదిరిన ఒపపదం ఏమిటి. కొంతమంది దళారులు ఈ రేషన్ బియ్యం వ్యాపారాన్ని వృత్తిగా ఎంచుకొని డైరెక్ట్‌గా




రేషన్ షాపుల వద్ద నిలబడి వాటిని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. కొంతమంది రేషన్ షాపు డీలర్లు అసలు నేరుగా బియ్యాన్ని వారే మిల్లర్లకు తరలిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. వైరాలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహిస్తే రేషన్ షాపుల వద్ద జరుగుతున్న అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం దందా, అదేవిధంగా మిల్లర్ల వద్ద పెద్ద ఎత్తున నిల్వ ఉంచి సిఎంఆర్ పేరుతో కలిసి ప్యాకింగ్ చేస్తున్న వ్యవహారాలుకూడా బయటకు వస్తాయి.

# తూకం లేకుండానే బియ్యం రవాణా..!

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 33 మంది రేషన్ డీలర్లు గత రెండు నెలల నుంచి కమిషన్ రాక కష్టాలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం విడుదల చేయడంతో సర్వర్ సమస్యతో సతమతమవుతున్నారు. ఒకే రేషన్ కార్డుకు సంబంధించిన వ్యక్తి మూడుసార్లు వేలిముద్ర పెట్టాల్సి ఉండటంతో ఒక్కో రేషన్ కార్డు దారుడు అరగంట పాటు వేచి ఉండాల్సి వస్తుంది. దానికి తోడు ఒకేసారి మూడు నెలల బియ్యం దిగుమతి కావడంతో గదులు ఖాళీగా లేకపోవడం వలన అద్దె గదులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం నుంచి వచ్చిన రేషన్ బియ్యం లారీల నుంచి వేరే లారీ కు దిగుమతి కాంటా వేసి లోడింగ్ చేయాల్సి ఉండగా నేరుగా లోడింగ్ చేయడంతో 100 క్వింటాలకు ఒక క్వింటా నష్టపోతున్నట్లు రేషన్ డీలర్లు వాపోతున్నారు. మూడో నెల గడుస్తున్న కూడా కమిషన్ రాకపో వడంతో అద్దె గదులకు రవాణా ఖర్చులకు ఇతర ఖర్చులకు సరిపోతు న్నాయి. ప్రతి నెల కమిషన్ అందక ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం అందించడంతో గదులు చాలక అద్దె గదులు నిర్వహణకు కమి షనర్ రాకపోవడంతో నిల్వ చేయలేకపోతున్నామని నిర్వాణ ఖర్చులు కు భారం మోయలేకపోతున్నామని రేషన్ డీలర్లు తెలుపుతున్నారు. మొత్తం మీద రేషన్ డీలర్లు పేద ప్రజలకు అందించే రేషన్ బియ్యం నిర్వ హణ కష్టంగా మారిందని పేర్కొంటున్నారు.

# కమ్యూనిస్టులతోనే హక్కుల సాధన





(మొదటిపేజీ తరువాయి)
స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని స్వాతంత్ర్యం తర్వాత కూడా ప్రజల, కార్మికుల, కర్షకుల హక్కుల కోసం అనునిత్యం సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. సిపిఐ తో పాటు ఇతర కమ్యూ నిస్టు పార్టీలు కలిసి పోరాటం చేయడం వల్లనే దేశంలో జమీందారులు, జాగీర్‌దారులు, పటేల్ పట్వారీ వ్యవస్థలు రద్దయ్యాయన్నారు. ఎంతో మంది భూములు లేని పేదలకు భూములు కల్పించిందన్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగా 44 కార్మిక హక్కుల చట్టాలను కల్పించుకున్నామ న్నారు. సిపిఐ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు అజరామరమన్నారు. ప్రస్తుత యువతకు కూడా కమ్యూనిస్టు పార్టీ ఆవశ్యకత గురించి తెలపాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో రాచరిక వ్యవస్థను నిర్మూలించడానికి నైజాం నిరంకుశ పాలనను పారద్రోలడానికి సిపిఐ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు.కమ్యూ నిస్టు పార్టీ చేసిన పోరాటాలు నేటి యువత తెలుసుకోవాలన్నారు. పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధా నాలపై పోరాటాలు సాగించాలన్నారు. సిపిఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఇండ్లు కట్టించాలని మొట్టమొదటి సారి అసెంబ్లీలో ప్రస్తావించింది కమ్యూనిస్టులేనని ఆయన తెలిపారు.



1973లో ప్రతిపక్ష నేతగా ఉన్న సిపిఐ శాసన సభ్యులు మహ్మద్ రజబ్‌అలీ పేదలకు ఇండ్లు కట్టుకోవడానికి ఐదువేలు మంజూరు చేయా లని అడగగా అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఒప్పుకున్నారన్నారు. అప్పుడు కమ్యూనిస్టులు అడిగిన ఐదువేల రూపాయల నుంచి ఇప్పుడు ఐదు లక్షల వరకు ఇల్లు కట్టు కోవడానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుందంటే అది కమ్యూనిస్టుల చలువేన న్నారు. 2006లో రైతులకు రుణమాఫీ చేయా లని బ్యాంకుల ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో 48 గంటల పాటు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వ హిస్తే అవహేళన చేశారని రైతులకు రుణమాఫీ ఎలా చేస్తారని ఎద్దేవా చేశారన్నారు. ఇప్పుడు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వాలు ముందుకు వచ్చాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనే యులు, ఏనుగు వెంకటేశ్వరరావు, బెజవాడ రవిబాబు, జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, తూము రోషన్‌కుమార్, ఏఐవైఎఫ్ ఖమ్మంజిల్లా ప్రధాన కార్య దర్శి నానబాల రామకృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మంజిల్లా అధ్యక్షులు మడు పల్లి లక్ష్మణ్, బోనకల్ మండల కార్యదర్శి వెంగళ ఆనందరావు, సహాయ కార్యదర్శి జక్కుల రామారావు, ముష్టికుంట్ల గ్రామశాఖ కార్య దర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మోగనున్న బడి గంట..!

(మొదటిపేజీ తరువాయి)
కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 1,269 పాఠశాలలు ఉండగా 69,241 మంది విద్యార్థులు ఉన్నారు. జిల్లాలోని 955 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా మరమ్మతు పనులు చేపట్టారు. ఇందు కోసం ప్రభుత్వం రూ. 35 కోట్లు నిధులు కేటాయించింది. అరకొర మినహా అన్ని పాఠశాలల్లో వసతులు సమకూర్చారు. మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణాలు, అదనపు తరగతి గదులు, విద్యుత్ సౌకర్యం, భవనాలకు రంగులు వేయిం చారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పూలు, తోరణాలతో అలంకరించి స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేపట్టారు. బడిబాట కార్యక్రమాన్ని ఈనెల ఆరు నుంచి 19 వరకు నిర్వహించను న్నారు. అందులో భాగంగా ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేలా ఉపాధ్యా యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈనెల 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న సంద ర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముగ్గుల పోటీలతో పాటు విద్యార్థులకు ఉల్లా సకరమైన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 13న సామూహిక అక్షరాభ్యాస కార్య క్రమం నిర్వహించనున్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులతో బాలసభ నిర్వహించనున్నారు. ఈనెల 16న తొలిమెట్టు కార్యక్రమంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించను న్నారు. ఈనెల 17న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సంబంధించి కార్యక్రమాలు నిర్వహించ నున్నారు. బాలిక విద్యతో పాటు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు చేపట్టనున్నారు. కెజిబివిలలో విద్యతో పాటు క్రీడలు ఇతర రంగాలకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించను న్నారు. ఈనెల 18న డిజిటలైజేషన్ ఆఫ్ క్లాస్‌రూమ్స్, బడితోట పెంపకం, మొక్కలు నాటే కార్య క్రమం చేపట్టనున్నారు. ఈనెల 19న పాఠశాలల్లో స్పోర్ట్స్ డే సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించనున్నారు.

**పుస్తకాలు, యూనిఫాం పంపిణీ :**
పాఠశాల తొలి రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు యూనిఫాం అందించేలా ఏర్పాటు చేశారు. ఖమ్మంజిల్లాకు 6,59,570 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, పార్ట్1లో 4,92,970 పుస్తకాలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు 4,46,410 పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. వీటిలో 3,76,918 పుస్తకాలను మండల విద్యా వనరుల కేంద్రాలకు తరలించారు. నోటు పుస్తకాలు 1,02,773 అవసరం ఉండగా 56,240 జిల్లాకు చేరాయి. మొత్తం 1,269 పాఠశాలల్లోని 69,241 మంది విద్యార్థుల యూనిఫాం కోసం 2,95,420 మీటర్ల క్లాత్ అవసరం ఉండగా ఇప్పటికే గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాలు, మున్సిపాలిటీలు, కార్పోరేషన్ పరిధిలోని మెప్మా సిబ్బందికి యూనిఫాం కుట్టేందుకు అప్పజెప్పారు. పాఠశాల పునః ప్రారంభం రోజునే రాత పుస్తకాలు, పాఠ్యపుస్తకాలతో పాటు ఒక జత ఏకరూప దుస్తులు ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.
గతేడాది ప్రయోగాత్మకంగా జిల్లాలో ఏడు పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బోధించేలా ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) విధానాన్ని ప్రవేశపెట్టింది. అది సత్ఫలితాలను ఇవ్వడంతో ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 176 పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)ని ప్రవేశపెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో మూతపడిన పాఠశాలలను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టిసారించి బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థులను చేర్పించేలా కృషి చేపట్టారు. బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కల్లూరు మండలంలోని ఓబుల్‌రావు బంజర పాఠశాలను పునః ప్రారంభించారు.

## చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి

(మొదటిపేజీ తరువాయి)
జాయింట్ సెక్రటరీ, ఆర్థిక సలహాదారు సంజీత్ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజలతో కలిసి ప్రధాన మంత్రి కృషి సంచయి యోజన (పిఎంకెఎస్‌వై) జల్ జీవన్ మిషన్ (జె జెఎం) ప్రాజెక్టులపై ఇరిగేషన్, మిషన్ భగీరథ, సంబంధిత జిల్లా అధికారులతో సమీక్షించారు. ఖమ్మంజిల్లాలో పిఎంకెఎస్‌వై క్రింద చేపట్టిన వివిధ ప్రాజెక్టు పనుల పురోగతి వివరాలు, మిషన్ భగీరథ, జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టు వివరాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీ సంజీత్ మాట్లాడుతూ చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించేవిధంగా ప్రాజెక్టుల పెండింగ్ పను లను పూర్తి చేసేందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందన్నారు. ఖమ్మంజిల్లాలో క్షేత్ర స్థాయి పర్యటనలో మిషన్ భగీ రథ ద్వారా ప్రజలకు సరఫరా చేసే నీటి నాణ్యత చాలా బాగుందని, రెగ్యులర్‌గా శుద్ధి చేసిన త్రాగునీరు ప్రజల ఇంటి వద్దకు సరఫరా చేస్తున్నందుకు వారు కూడా చాలా సంతోషంగా ఉం డటం గమనించామన్నారు. ప్రతి ఆవాసానికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని, ప్రజలకు సరఫరా చేసే మంచినీటి నాణ్యతను గ్రామ పంచాయతీ పరిధిలో రెగ్యులర్‌గా పరీక్ష చేసేలా వ్య వస్థ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఖమ్మంజిల్లా పరిధిలో నీటిపారుదల ప్రాజెక్టు సాగు నీరు సరఫరా కోసం పెండింగ్ పనులు ఏమైనా ఉంటే వాటిని పూర్తి చేసేందుకు కేంద్రం సహక రిస్తుందని, కేంద్రం నుంచి ఎటువంటి సహాయం కావాలో ప్రణాళికలు తయారు చేసి ప్రతిపాద నలు అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో 7.70 లక్షల ఎకరాల వ్యవసాయ భూమికి గాను 4.5 లక్షల ఎకరాలకు నీటిపారుదల వ్యవస్థ క్రింద ఆయకట్టు ఉందన్నారు. సన్న రకం వడ్ల సాగుకు ప్రభుత్వం బోనస్ ఇస్తున్న నేపథ్యంలో వరి పంట విస్తీర్ణం పెరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం గతేడాది ఐదువేల ఎక రాల నుంచి 35వేల ఎకరాలకు పెరిగిందని జిల్లాలో మూడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. ఖమ్మంజిల్లాలో స్టోరేజ్ వాటర్ లేవని కేవలం బ్యాలెన్సింగ్ రిజ ర్వాయర్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఆయకట్టు స్థిరీకరణ చేసేందుకు, నూతన ఆయకట్టు సృష్టించేందుకు ప్రస్తుతం గోదావరి పై సీతారామ ఎత్తిపోతల పథకం పనులు జరుగు తున్నా యన్నారు. గతేడాది వచ్చిన వరదల కారణంగా మారుమూల ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైపు లైన్ కొంత మేరకు దెబ్బతినడంతో లోకల్ సోర్స్ ద్వారా అక్కడ త్రాగునీరు సరఫరా చేస్తు న్నా మన్నారు. మిషన్ భగీరథ ద్వారా 60 జనావాసాలకు అవసరం మేరకు త్రాగునీటిని సర ఫరా చేయలేకపోతున్న కారణంగా ఆ ప్రాంతాల్లో లోకల్ సోర్స్ వాడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సిజిడబ్ల్యూబి టెక్నికల్ అధికారి మాధవ్, సిడబ్ల్యూసి టెక్నికల్ అధికారి రూపేష్, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ డివి రమేష్‌బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ శివధర్మతేజ, మిష న్ భగీరథ ఎస్‌ఈ శేఖర్‌రెడ్డి, జెడ్పి సిఈవో దీక్షారైనా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యా సయ్య, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధితఅధికారులు పాల్గొన్నారు.

# ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలి

**-కల్తీ లేని ఉత్పత్తులకు కేరాఫ్ గా మహిళా మార్ట్ నిలవాలి**
**-మహిళా మార్ట్‌ను సందర్శించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా న్యాయబద్ధంగా మహిళా సంఘాలు వ్యాపారాన్ని నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కల్తీ లేని, నాణ్యమైన ఉత్పత్తులకు కేరాఫ్ గా మహిళా మార్ట్ నిలవాలన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని మహిళా మార్ట్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. మహిళా మార్ట్ నిర్వహణలో మహిళలు ఎదుర్కొన్న అనుభవాలను ప్రభుత్వపరంగా ఏమైనా సౌకర్యాలు కల్పించాలా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వ్యాపారాన్ని విస్తరించేందుకు కొత్త కొత్త ఆలోచనలు, కొనుగోలు దారులకు అవసరమైన ఉత్పత్తులను ఉంచేవిధంగా ఏర్పాటు చేస్తూ వారి యొక్క సలహాలను తీసుకోవాలని మహిళా సభ్యులకు కలెక్టర్ సూచించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కల్తీ లేని నాణ్యమైన పదార్థాలు సరసమైన ధరలకు ఖమ్మం మహిళా మార్ట్‌లో లభిస్తాయనే నమ్మకం ప్రజల్లో ఏర్పడుతుందని దానిని నిలబెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. మహిళా మార్ట్‌లో ప్యాకింగ్ కూడా అద్భుతంగా ఉందని ఇదే విధానం కొనసాగించాలన్నారు. ఖమ్మం మహిళా మార్ట్‌లో ఎటువంటి పదార్థాలు విక్రయించాలో జిల్లా మహిళా సమాఖ్యలో చర్చించుకుని నిర్ణయించాలన్నారు. ఒక ర్యాకులో మహిళా సంఘాలు తయారుచేసే పదార్థాలు ప్రత్యేకంగా పెట్టాలన్నారు. మహిళా మార్ట్ నుంచి వచ్చే లాభాలతో వ్యాపార విస్తరణకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనారోగ్యం కలిగించే పదార్థాలను మహిళా మార్ట్‌లో విక్రయించడానికి వీలు లేదని, విస్తరాకులు సన్నరకమైన ప్లాస్టిక్ లేనివి విక్రయించాలన్నారు. మహిళలపై అపారమైన నమ్మకంతో అవకాశం కల్పించామన్నారు. మహిళా మార్ట్‌లో స్టాక్ ఎంట్రీ, ఇతర పనులు చేసేందుకు రెండు కంప్యూటర్లు, ప్రింటర్లతో ఏర్పాటు చేయాలని అవసరమైన సామగ్రిని కలెక్టరేట్ నుంచి అందిస్తామన్నారు. బ్యాగ్ డిపాజిట్, పాదరక్షల కోసం ప్రాంగణం బయట ఒక ర్యాక్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఖమ్మం మహిళా మార్ట్ ద్వారా ఇతర లోగో పదార్థాలను విక్రయించవద్దన్నారు. ఖమ్మం మహిళా మార్ట్‌కు మరింత పేరు తీసుకు రావాలన్నారు. మహిళా మార్ట్‌లో ప్లాస్టిక్ కవర్లు కాకుండా క్లాత్ బ్యాగులు వాడాలన్నారు. అనంతరం మహిళా మార్ట్‌లో కొన్ని వస్తువులు, పిండి వంటలను కలెక్టర్ కొనుగోలు చేసి ఫోన్ పే ద్వారా బిల్లు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థికి ఎస్‌బిఐటి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రకృతి వైపరీత్యం వల్ల తల్లిదండ్రులను కోల్పోయిన తమ కళాశాల విద్యార్థి షేక్ షరీఫ్‌కు ఎస్‌బిఐటి కళాశాల తరుపున ఆర్థిక చేయూత నందించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. గతేడాది ఖమ్మంజిల్లాను వరదలు ముంచెత్తిన సమయంలో కూసుమంచి మండలం పాలేరు, నాయకన్‌గూడెం వద్ద తమ కళాశాల విద్యార్థి షరీఫ్ తల్లిదండ్రులు షేక్ యాకూబ్, సైదాబీ లు ఇద్దరు మృతి చెందడంతో షరీఫ్ ఒంటరిగా మిగిలిపోయాడని గుండాల కృష్ణ తెలిపారు. షరీఫ్ చదువుకు ఇబ్బంది కలుగకుండా ఉండేలా నేషనల్ ఇన్సూరెన్స్ ద్వారా రెండు లక్షల రూపాయల చెక్కును బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఛైర్మన్ గుండాల కృష్ణ అందజేశారు. షరీఫ్‌కు ఎస్‌బిఐటి యజమాన్యం ఎల్లప్పుడు తోడుగా ఉంటుందని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ధాత్రి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల వల్ల ప్రమాదవశాత్తు తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు తమ కళాశాల అండగా ఉంటుందని తెలిపారు. వారి విద్యకు ఆటంకం కలుగకూడదనే సదుద్దేశ్యంతో ఈ పథకాన్ని అవలంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ధైర్యాన్ని ఇవ్వడానికి ఇటువంటి ఆలోచన చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అకామిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో భూ సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రైతు సదస్సులతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని మన్నె ఉషాశారద తెలిపారు. బుధవారం మండల పరిధిలోని అయ్యవారిగూడెం, భీమవరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులు తమ భూములకు సంబంధించిన ఫిర్యాదులు అధికారులకు అందించారు. తహశీల్దార్ ఉషాశారద మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం తీసుకువచ్చిందని తెలిపారు. గతంలో ధరణి చట్టంలో పరిష్కారం కాని భూ సమస్యలకు భూ భారతి చట్టంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. సర్వే నెంబర్ తప్పులు, భూమి హెచ్చు తగ్గులు రికార్డులలో తప్పుల నమోదు వంటి పలు సమస్యలను రైతులు భూ భారతి చట్టం ద్వారా పరిష్కరించేందుకు వీలుకలుగుతుందని తెలిపారు. భీమవరం రైతు సదస్సు వద్ద శీలం వెంకటేశ్వర్‌రెడ్డి, పుల్లారెడ్డి, తల్లపురెడ్డి వెంకటరెడ్డి తదితరులు దరఖాస్తులు అందించే క్రమంలో వారి భూముల గట్టు తగాదాలకు సంబంధించి ఇరువర్గాల మధ్య వాగ్వావాదం, ఘర్షణ వాతావరణం కొద్దిసేపు చోటుచేసుకుంది. ఇరువర్గాలకు అధికారులు సర్దిచెప్పడంతో వివాదం ముగిసింది. కార్యక్రమంలో సిబ్బంది చందు, వరలక్ష్మి, వివిధ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# తేజవాత్ బాలాజీనాయక్‌కు నివాళి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం అంజనాపురం గ్రామానికి చెందిన బిజెపి పార్టీ ఖమ్మం జిల్లా గిరిజన నాయకులు తేజవాత్ బాలాజీ నాయక్ ఇటీవల అకాల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బిజెపి పార్టీ నాయకులు డాక్టర్ శీలం పాపారావు బుధవారం అంజనాపురంలోని తేజవాత్ బాలాజీ నాయక్ ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.మండల కేంద్రంలో ఒక బలమైన నాయకున్ని కోల్పోవటం చాలా బాధాకరమని, కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి తల్లాడ మండల అధ్యక్షులు చల్లా నాగులు, జిల్లానాయకులు వీరవెల్లి రాజేష్,,, గడీల నరేష్, పాలేరు రాము, మండల నాయకులు పాల్గొన్నారు.

# ఈవిఎం గోడౌన్ తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్‌ను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ సీళ్లను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలకు వెళ్లి ఈవిఎం, వివి ప్యాట్లు ఉన్న గది లోపల కలెక్టర్ పరిశీలించారు. తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిసి కెమెరాల పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ గార్డుకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగ పర్యవేక్షకులు సిహెచ్ స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎ. గోపాలరావు, శ్రీనివాస్, రవీంధర్, ఆర్. ప్రకాష్, సతీష్‌బాబు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపద మిత్రలకు విపత్తులు ఎదుర్కోవడంపై శిక్షణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆపద మిత్రలకు విపత్తులు ఎదుర్కోవడంపై శిక్షణ అందించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు బుధవారం జెడ్పి సమావేశ మందిరంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ సభ్యులు ఆర్. మాధిలేటి ఆధ్వర్యంలో శిక్షణ అందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో విపత్తులు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. వరదలు, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అందుబాటులో ఉన్న వనరులతో ఏవిధంగా బయటపడవచ్చు, సిపిఆర్ ఎలా చేయాలి, దాని ప్రాముఖ్యత వంటి అంశాలను శిక్షణలో ఆపద మిత్రలకు పూర్తి స్థాయిలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆపద మిత్రలు, గ్రామీణ అభివృద్ధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్‌కు సన్మానం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని ఎర్రుపాలెం సెక్టార్‌లోని చొప్పకట్లపాలెం 2 అంగన్వాడీ ఉపాధ్యాయురాలు పరిమి ఝాన్సీ రాణి బుధవారం పదవి విరమణ సందర్భంగా ఎసిడిపిఓ కృష్ణశ్రీ ఆధ్వర్యంలో అంగన్వాడీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణశ్రీ మాట్లాడుతూ అనుక్షణం సెంటర్లోని చిన్నారులకు కంటికి రెప్పలా కాపాడి ఎందరో విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పరిమి ఝాన్సీరాణి బంగారు బాటలు వేశారని కొనియాడారు. చొప్పకట్లపాలెం 2 అంగన్వాడీ ఉపాధ్యాయురాలుగా పదవి కాలాన్ని పూర్తి చేసుకున్న మీకు సుఖమయ జీవితం ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సరిత, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తుపై ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం అవగాహన



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు మనిషి తనకు తాను ఎలా రక్షించుకోవాలో ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్డిఆర్ఎఫ్ బృందం బుధవారం రాకాసి తండా ప్రజలకు అవగాహన కల్పించింది. గత సంవత్సరం సెప్టెంబర్ వారంలో వచ్చిన భారీ వర్షాలకు తిరుమలాయపాలెం మండల పరిధిలోని రాకాసితండాతో పాటు పలు గ్రామాల్లో బిటి రోడ్లు, సిసి రోడ్లు, చెరువు కట్టలు, ఇండ్లు, పంటలు, పశు సంపదకు తీవ్ర నష్టం వాటిల్లిందని వారు తెలిపారు. రాకాసి తండా ప్రజలు చిగురుటాకుల ఒనికి భారీ వర్షాలకు ఇండ్లపైకి ఎక్కి ప్రజలు తమ ప్రాణాలు రక్షించుకున్నారని తెలిపారు. వరదలు వచ్చినప్పుడు ప్రజలు ముందుగానే అప్రమత్తంగా ఉండాలని, ప్రకృతి విలయాన్ని ముందుగా మనిషి ఊహించలేడని వారు తెలిపారు. విపత్తు సంభవించేటప్పుడు ఆరాటపడకుండా ముందుగానే జాగ్రత్తపడితే ప్రాణ ఆస్తి నష్టాలు నివారించుకోవచ్చని అవగాహన కల్పించారు. రాకాసి తండా ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, మళ్లీ వర్షాలు మొదలయ్యాయని, ముందుగానే ఆకేరు వరద ఉధృతి పరిశీలించి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, మూగజీవాలను విలువైన వస్తువులను జాగ్రత్త పర్చుకోవాలని తెలిపారు. అజ్మీర్ తండా గ్రామపంచాయతీ పరిధిలో వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలువురికి శిక్షణ ఇచ్చి అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్డిఆర్ఎఫ్ పరిశీలకులు జానయ్య, తహశీల్దార్ లూథర్ విల్సన్, ఎంపిడిఓ సిలార్‌సాహెబ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ బడిబాట



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని రామ గోవిందపురం, మేడిశెట్టి వారిపాలెం అడ్డరోడ్డు అంగన్ వాడి సెంటర్లలోని టీచర్లు బుధవారం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలను అంగన్ వాడీ కేంద్రంలో చేర్పించాలని, ఐదు సంవత్సరాల నుండి పిల్లలను ప్రైమరీ స్కూల్ నందు చేర్పించాలని తల్లిదండ్రులకు వివరించారు .అదే విధంగా బడిబాటపై ప్లకార్డులతో ర్యాలీ గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ గంగాజలం, అంగన్ వాడీ టీచర్లు సౌభాగ్యవతి, కృష్ణకుమారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం లింగపాలెం గ్రామంలో 9 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 9,10,044 విలువ గల కళ్యాణ లక్ష్మి చెక్కులను సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దాయనంద్ బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపడుతున్న ప్రతి ఒక్క పథకం ప్రజల అందరికి అందుతున్నాయన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండి, నేటి వరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలకు అందిస్తూనే ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతును తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో వేంసూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు సోమిరెడ్డి, సీనియర్ నాయకులు జెల్ది జగన్మోహన్ రావు, ఎర్రా సత్యం, వేంసూరు మాజీ సర్పంచ్ ఫైజుద్దీన్,తహాశీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వికసిత్ భారత్ 2047 మేధో మధన సదస్సు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని జే కన్వెన్షన్ హాల్లో గురువారం వికసిత్ భారత్ 2047 మేధో మదన సదస్సు నిర్వహించటం జరుగుతుందని బాజాపా నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా భారతీయ జనతాపార్టీ జాతీయ నాయకులు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సహ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ సభ్యులు పొంగులేటి సుధాకర్ రెడ్డి హజరవుతారన్నారు. ఈ సదస్సులో సత్తుపల్లి నియోజకవర్గంలోని డాక్టర్లు, లాయర్లు, విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలోచన విధానాలను పంచుకొని వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించుకోవడంలో భాగస్వామ్యాలవ్వాలని, వికసిత్ భారత్ ఖమ్మం జిల్లా కన్వీనర్ డాక్టర్ శీలం పాపారావు, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వీరంరాజు, జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరేష్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు మట్ట ప్రసాద్ నాగ స్వామి, ప్రభాకర్ రెడ్డి, మందా శివ, శివ పాలకొల్లు శ్రీను, సుధాకర్ గాయం నాగరాజు, కృష్ణయ్య, కార్తీక్ వెంకటరామిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచండి




**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛ మిత్ర సభ్యులకు బుధవారం పియం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వి యం బంజర నందు ఒక రోజు శిక్షణ నిర్వహించనైనది. ఈ శిక్షణ కార్యక్రమం నందు మండల విద్యాశాఖాధికారి, పెనుబల్లి యస్. సత్యనారాయణ మాట్లాడు రేపటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నాయి. కావున స్వచ్ఛ మిత్ర సభ్యులు పాఠశాల తరగతి గదులు, పాఠశాల ఆవరణ, మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీరు నిల్వకుండా చూడాలని, పాఠశాల నందు చెత్తను గ్రామ పంచాయతీ ట్రాక్టర్స్ ద్వారా బయటకు తరలించాలని, విద్యార్థులు అనారోగ్యానికి గురి కాకుండా చూడాలని కోరారు.ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ యన్ విహెచ్ ప్రసాద్, దీపిక పరికరాలను వినియోగించి శుభ్రం చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి వి రామారావు , బండి రాము, సిఆర్ పిలు, మండల వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు

**-పంటల సాగుపై రైతులకు అవగాహన**
**-ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు**




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నకిలీ విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని ప్రభుత్వ ఆమోదం పొందిన విత్తనాలను కొనుగోలు చేయాలని ఖమ్మం డివిజన్ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రాంక్యాతండా, ఎన్‌వి బంజర గ్రామాల్లో వానా కాలం పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని దీని వల్ల అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో పాటు అంతర పంటలుగా మొదటి మూడేళ్లు మిరప, పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేయవచ్చునని లేదా కోకో, వక్క వంటి ఇతర పంటను కూడా సాగు చేయవచ్చునని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ప్రభుత్వం కూడా రాయితీలు కల్పిస్తూ ప్రోత్సహిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నర్సరీలలో, పురుగు మందుల దుకాణాల్లో మిర్చి నారు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని వాటిని పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తపర్చుకోవాలని తెలిపారు. విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు కంపెనీల మోసాల బారిన పడకుండా కంపెనీ నుంచి బాండ్ తీసుకుని విత్తన మొక్కజొన్న సాగు చేయాలని సూచించారు. రైతులు అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడకుండా నానో డిఏపి వాడకం అలవాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. 45 కేజీల యూరియా బ్యాగుల వాడకం తగ్గించాలని రైతులకు సూచించారు. పంటల సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులకు వ్యవసాయ అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారని వారి సలహాలు, సూచనలు పాటిస్తూ మంచి దిగుబడులు సాధించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి , ఏఈవో వేదవ్యాస్, రైతులు పాల్గొన్నారు.

# పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి

**-స్కావెంజర్లకు పారిశుధ్యంపై అవగాహన**





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పాఠశాలలను పారిశుధ్య లోపం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని రఘునాథపాలెం మండల ఎంఈవో డి. రాములు తెలిపారు. మండల పరిధిలోని రఘునాథపాలెం ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని అన్ని పాఠశాలల స్కావెంజర్లకు పారిశుధ్యంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా ఎంఈవో రాములు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో పారిశుధ్య లోపం లేకుండా పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత స్కావెంజర్లదన్నారు. మరుగుదొడ్లు, పాఠశాల ప్రాంగణాన్ని పచ్చదనం పరిశుభ్రతతో ఉండేలా స్కావెంజర్లు విధులు నిర్వహించాలని తెలిపారు.ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ, పారిశుధ్యానికి సంబంధించి రసాయానాల గురించి క్షేత్ర స్థాయిలో వివరించారు. ఈ సందర్భంగా మండలంలోని ఇద్దరు స్కావెంజర్లు పి. జ్యోతి, డి. మంగతాయిలను సన్మానించారు. శిక్షణ రిసోర్స్ పర్సన్‌గా రంగారావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు, స్కావెంజర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నడిచే క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి బానోత్ జూంకిలాల్ కోరారు. బుధవారం ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ 202526 విద్యా సంవత్సరానికి నాలుగవ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థినీ, విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానించినట్లు తెలిపారు. తెలంగాణరాష్ట్రంలో హకీంపేట్, కరీంనగర్, అదిలాబాదు జిల్లాలో క్రీడా పాఠశాలలు ఉన్నాయన్నారు. జూన్ 16 నుండి 19వ తేదీ వరకు మండల స్థాయి ఎంపిక ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో జూన్ 23 నుండి జూన్ 26వ తేదీ వరకు అర్హులైన విద్యార్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల ఎంపికను జూలై 1 నుండి జూలై 5వ తేదీ వరకు పూర్తి చేస్తారన్నారు. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ పాఠశాలలో 120 సీట్లు ఉన్నాయన్నారు. ఒక్కొక్క క్రీడా పాఠశాలలో బాలురలకు 20సీట్లు, బాలికలకు 20సీట్లు చొప్పున స్పోర్ట్స్ స్కూల్‌లో సీట్లు భర్తీ చేస్తామరని అన్నారు. బాల, బాలికలకు 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల రన్ ఇలా పలు క్రీడాలను నిర్వహిస్తారని తెలిపారు. వయస్సు ధృవీకరణ, బోన్ అబ్ నార్మలిటిస్‌లో వైద్య పరీక్షలు చేస్తారన్నారు. జూన్ 7 వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అయిందని, విద్యార్థిని, విద్యార్థులు తమ మొబైల్ నుండి లేదా వెబ్సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను రూపొందించి విద్యార్థిని, విద్యార్థులకు అందుబాటులో ఉంచారన్నారు. పరీక్షలు నిర్వహించే తేదీ, ప్రవేశానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం జిల్లా క్రీడాలు, యువజన శాఖ అధికారులను సంప్రదించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

## పిడుగుపాటుతో రూ. ఐదు లక్షలు ఆస్తి నష్టం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని మంగళవారం రాత్రి కురిసిన ఈదురు గాలులు, మెరుపులు ఉరుములతో కూడిన వర్షంతో పిడుగుపాటు వలన మధు గృహాలలో టీవీలు, ఫ్యాన్లు, ఏసీలు ,లాప్టాప్ లో దగ్ధం కాగా విద్యుత్ శాఖలో బత్తుల పల్లి లోని నియంత్రిక కల్లూరు లోని ఒక విద్యుత్ నియంత్రికలు దగ్ధం కావడంతో విద్యుత్ శాఖకు రెండు లక్షల పది గృహాలలో విద్యుత్ పరికరాలు దగ్ధం అయినట్లు గృహస్తులు మౌర్య నిర్మల్ కుమార్, శ్రీనివాసరావు, బ్రహ్మం ప్రసాద్, సుబ్బారావు లతోపాటు విద్యుత్ శాఖ అధికారి పివెంకట్ లు తెలిపారు. అర్ధరాత్రి పిడుగుపాటుకు గృహ పరికరాలు దగ్ధమవుతున్న సమయంలో విద్యుత్ శాఖ సిబ్బందికి ఫోన్ చేస్తే స్పందించలేదని వారు తెలిపారు. అదేవిధంగా విజయ్ నగర్ లో ఒక నియంత్రిగాను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారికి తెలిపారు ఈ విషయమై పరిశీలిస్తామని వివరణ ఇచ్చారు.

# పేద వర్గాలకు ఎర్ర జెండానే భరోసా

**-ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు కార్యకర్తలు స్పందించాలి**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**
**-ఉత్సాహంగా ములకలపల్లి మండల సిపిఐ మహాసభ**








**ప్రజాపక్షం/ములకలపల్లి:** పశ్నించే కమ్యూనిస్టులపై నరేంద్ర మోదీ, అమిత్ షా కక్ష కట్టి బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని రాజేపేట గ్రామంలో సిపిఐ ములకలపల్లి మండల 17వ మహాసభ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. తొలుత అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, మహాసభ ప్రారంభ సూచీగా అరుణ పతాకాన్ని ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పలువురు మావోయిస్టుల ఎన్కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీం కోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ఘటనపై ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని తెలిపారు. స్థానిక ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్కౌంటర్ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యగా చూడాలని అన్నారు. 2026 మార్చి 31వరకు నక్సలైట్లను అంతముందిస్తామని లక్ష్యంగా పెట్టుకుని మరి ఎన్కౌంటర్లు చేస్తుండటం, మరో పక్క తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా ఎన్కౌంటర్లకు పాల్పడుతున్న విషయం స్పష్టమవుతుందన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నంటినీ పరిగణలోకి తీసుకొని సుప్రీం కోర్టు న్యాయ విచారణ చేపట్టవలసిన అవసరం ఉందని కోరారు. పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలకు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయితీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఐ పార్టీ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ దోపిడీ, అణచివేతకు గురవుతూ దుర్భరజీవితం గడుపుతున్న ఏజెన్సీ పల్లె ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నంది పలికి ఆధునికతవైపు నడిపించింది ఎర్ర జెండానేనని, అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం, దోపిడీ, అణచివేతలున్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పూర్తి అవగాహనతో ప్రజా సమస్యలపై స్పందించాలని పిలుపునిచ్చారు. ఎస్‌కే జబ్బార్, నరాటి ప్రసాద్, కోర్రి భద్రం, అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరావు, డివిజన్ కార్యదర్శి ఎస్‌డి సలీం, సిపిఐ మండల కార్యదర్శి ఎండీ యూసుఫ్, నాయకులు కోర్స భద్రం, అనుముల సాయి, వీరు, బైరు సాయి, రంజిత్, కుమార్, అర్జున్, కట్టం నాగేష్, పుష్పవతి, ఇమానయల్, పాయం బాబురావు సడియం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐలో చేరిన ముఖమామిడి తండా గ్రామస్తులు...**

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, నాయకులు నరాటి ప్రసాద్ సమక్షంలో భూక్యా దేవ్ సింగ్, బాలు, భద్రు ఆధ్వర్యంలో 40 కుటుంబాలు సిపిఐలో చేరారు.

# భూ భారతి ద్వారా సమస్యలన్నీ పరిష్కారం

**-ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి**
**-తహశీల్దార్ పున్నం సత్యనారాయణ ఆధ్వర్యంలో లింగపాలెం, తుమ్మూరు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం వల్ల ప్రతి ఒక్క రైతు సమస్య పరిష్కారమవుతుందన్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. బుధవారం నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం లింగపాలెం, సత్తుపల్లి మండలం తుమ్మూరు గ్రామాలలో సత్తుపల్లి తహశీల్దార్ పున్నం సత్యనారాయణ ఆధ్వర్యంలో భూభారతి చట్టంపై అవగాహన కల్పించేందుకుగాను రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాగమయి హాజరై మాట్లాడుతూ గతం బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ వలన నష్టపోయి రోడ్డున పడ్డ కుటుంబాలను ఈ రాష్ట్రంలో చూసామన్నారు. నాటి ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రైతుల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా భూ సమస్యలు ఉన్న వారి నుండి దరఖాస్తు లు తీసుకొని, భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తుందన్నారు.భూ భారతి చట్టం ద్వారా సమస్యలన్ని పరిష్కారమవుతాయన్నారు.భూభారతి చట్టం రూపకల్పనలో అనేక పరిశోధనలు ,మేధావుల సలహాలు,సూచనలు ద్వారా ఈ తెలంగాణ భూ భారతి చట్టాన్ని తీసుకురావటం జరిగిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే రాగమయి అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటామని.ప్రజలు కష్ట సుఖాల్లో తోడు, నీడగా ఉంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోరంపూడి జగన్, వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు సోమిరెడ్డి, సీనియర్ నాయకులు జెల్ది జగన్మోహన్ రావు, ఎర్రా సత్యం, వేంసూరు మాజీ సర్పంచ్ ఫైజుద్దీన్, వేంసూరు మండలం, లింగపాలెం గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతు సోదరులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఒడిలాంటిది అంగన్వాడీ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** అమ్మ ఒడిలాంటిది అంగన్వాడీ అని సూపర్వైజర్ స్వరాజ్యం అన్నారు. బుధవారం మండలంలోని వేపలగడ్డ పంచాయితీలో అమ్మ మాటఅంగన్వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో అమ్మమాటఅంగన్వాడీ బాట నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఎదుగుదల అంగన్వాడీతోనే ప్రారంభం అవుతుందని, అంగన్వాడీ పిల్లల విద్యకు మొదటి అడుగు వేస్తుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్నాయని, పెరటి తోటలు పచ్చదనంతో నిండి ఉన్నాయని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు అతీతంగా, విద్యా బోధన అందిస్తున్న విధానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, అంగన్వాడి కేంద్రాల శుభ్రంగా ఉంచుకోవడం జరుగుతుందన్నారు. ఈరోజే మీ పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు భద్రు, అంగన్వాడీ టీచర్ సునీత, ఎం బోడమ్మ, భారతి, హెల్పర్స్ రామలక్ష్మి , ఆశా జోగమ్మ, తల్లు పిల్లలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కళాశాల పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మరమత్తుల నిమిత్తం ఎంఎల్‌ఏ మాళోత్ రాందాస్ నాయక్ సహాయ సహకారాలతో రూ 30లక్షల నిధులు మంజూరు అయ్యాయి. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ నోముల విజయ కుమారి కళాశాల మరమత్తుల పనులను శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల మరమత్తులను నిధులను మంజూరు చేయించిన ఎంఎల్‌ఏ మాళోత్ రాందాస్ నాయక్‌కు సిబ్బంది, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల సిబ్బంది, కాంట్రాక్టర్ బానోత్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమిలీ పాఠశాలలో ఉచిత విద్యకై దరఖాస్తు చేసుకోండి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఎమిలీలో ఉచిత విద్యకై దరఖాస్తు చేసుకోవాలని, పరిమిత సీట్లు మాత్రమే ఉంటాయని మండలంలోని తల్లిదండ్రులకు పాఠశాల కరస్పాండెంట్ ములకలపల్లి గోపీనాథ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కడు నిరుపేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందజేస్తున్నమని, వితంతువు, ఒంటరి మహిళ, పురుషుడు, ఎవరి సంరక్షణలో అయినా పిల్లలు పెరుగుతున్నట్లయితే మండలంలో ఎక్కడి నుంచైనా మా పాఠశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులన్నిటిని పరిశీలించిన పిదప అందరికీ పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామని అన్నారు. ఎంపికైన విద్యార్థులకు 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు ఉచితంగా విద్యను అందిస్తామని అన్నారు. ఎంపిక అయిన వారు కేవలం పుస్తకాలు, యూనిఫామ్ మాత్రమే బయట తీసుకోవాలని, విద్యను మాత్రం పూర్తిగా ఉచితంగా అందిస్తామన్నారు. చదువు కొరకు ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కాబట్టి ఈనెల 25వ తేదీ లోపు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని పరీక్ష నిర్వహణ తేదీ గురించి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఫోన్లో సమాచారం అందిస్తామని, గడువు తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. వివరాలకు 9912467858, 9182202087 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## మండల స్థాయి స్వచ్ఛ మిత్రలకు శిక్షణ

**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్వచ్ఛ మిత్రలకు శిక్షణ కార్యక్రమం కోర్స్ డైరెక్టర్ జి మంజుల అధ్యక్షతన సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మండలంలోని 25 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు,3 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల స్వచ్ఛ మిత్ర లకు శిక్షణ కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరకగూడెం నందు నిర్వహించారు. స్వచ్ఛ మిత్ర లకు పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత, మొక్కలు పెంపకం అలాగే టాయిలెట్ పరిశుభ్రంగా ఉంచడం వారి విధులలో భాగంగా పాఠశాలను ప్రత్యేక శ్రద్ధతో పాఠశాల ఆవరణం లో ఖాళీ స్థలాలను కిచెన్ గార్డెన్ గా పెంపొందించేలా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ గా జే వెంకటేశ్వర్లు, బి. బావ సింగ్ కె. సూర్యనారాయణ, మండల (ఎంఆర్‌సి) సిబ్బంది గురువయ్య, జయబాబు, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ..

**-ఇద్దరికి గాయాలు**

**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలంలో బుధవారం సాయంత్రం రాళ్ళవాగు వద్ద ఎదురెదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పద్మాపురం గ్రామానికి చెందిన గోవిందరావు, పినపాక మండలంలోని గోవిందాపురానికి చెందిన వ్యక్తి గాయపడ్డారు. వెంటనే స్పందించిన స్థానికులు ఇద్దరినీ 108 అంబులెన్స్ ద్వారా సమీప ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హెల్ప్‌లైన్ 181ను ఉపయోగించుకోవాలి

**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**-లైంగిక వేధింపుల నిరోధక చట్టం గోడప్రతి ఆవిష్కరణ**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** హెల్ప్ లైన్ 181 నెంబర్‌ను మహిళలు ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మహిళా సాధికారత కేంద్రం ఖమ్మంజిల్లా ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహనకు రూపొందించిన గోడప్రతులు, కరపత్రాలను బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసే ఫిర్యాదుల స్వీకరణ పెట్టేలను కలెక్టర్ పరిశీలించారు. మహిళల భద్రత కోసం లైంగిక వేధింపుల చట్టం పివోఎస్‌హెచ్ యాక్ట్ మహిళలు పని చేసే ప్రదేశాల్లో మగవారు అనుచితంగా ప్రవర్తించడం, లైంగిక దాడులు, అవాంచనీయ, అసాంఘిక ప్రవర్తన ద్వారా వేధించిన వారికి ఈ చట్టం వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. మహిళల ఫిర్యాదు కోసం కలెక్టరేట్ గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లలోని టాయిలెట్ల వద్ద ఫిర్యాదుల స్వీకరణ పెట్టెలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. హెల్ప్‌లైన్ 181 నెంబర్‌ను ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ఛైర్‌పర్సన్ భారతిరాణి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి విష్ణుచందన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# రైతుల శ్రేయస్సు కోసమే 'రైతు ముంగిట శాస్త్రవేత్త'



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రైతు శ్రేయస్సు, అభివృద్ధి ధ్యేయంగా రైతు ముంగిట శాస్త్రవేత్త కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు. బుధవారం మండల పరిధిలోని సదాశివునిపాలెం గ్రామంలోస్థానిక వ్యవసాయ కళాశాల అశ్వారావుపేట వారి అధ్వర్యంలో వ్యవసాయ శాఖ వారి సహాయంతో రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్. డా. జై హేమంత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మితిమీరిన యూరియా వాడకం వల్ల వచ్చే సమస్యలు, పంట మార్పిడి, నీటి వనరుల సంరక్షణ, పర్యావరణాన్ని కాపాడాటానికి చెట్ల పెంపకం, రానున్న వర్షాకాలంలో చేపట్టవలసిన సేద్యపు పనులు, సాగు, యాజమాన్య పద్దతులు పంటలలో విన్నూత్నంగా పాటించాలాని సూచనలిస్తూ, వివరించారు. కళాశాల శాస్త్రవేత్త డా.మధు సూదనరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటపప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరిలో వున్న సన్నరకాలు, వానాకాలానికి అనువైనవి ఎంపిక చేయాలని సలహ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లడుతూ సన్న వరి రకాలు, రైతు నమోదు ప్రక్రియ, వరికీ వచ్చే మదత్తు ధరలు, రైతులకు ప్రయోజనాలను తెలియజేశారు. అదేవిధంగా మార్కెట్ కమిటీ డైరక్టర్ వినుకొండ కృష్ణ మాట్లాడుతూ రైతులకీ ఉపయోగపడే సలహాలు, సూచనలు శాస్త్రవేత్తల ద్వారా తసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ.ఓ ఆశాజ్యోతి, గ్రామ పెద్దలు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్స్, సీపర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారికి నక్కా రాజేశ్వరరావుకి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మటూరి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు గత విద్యా సంవత్సరం రావాల్సిన మెనూ బిల్లు వేతనాలను తక్షణమే చెల్లించాలని, రానున్న రోజుల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు ఇబ్బంది లేకుండా పత్తి నెల 5న బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని రామకృష్ణ కోరారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్స్, స్లీపర్స్ కి పెండింగ్ లో ఉన్న మూడు నెలల వేతనం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్వీపర్ల సమస్యను పరిష్కరించి వారికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏ ఐ టి యు సి .మండల అధ్యక్ష, కార్యదర్శులు కే బసవయ్య, టి రామారావు, మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె వెంకమ్మ, మహదేవ లక్ష్మి, పొదిలి సావిత్రి,జరీనా, సీత, షేక్ రహీం మున్నీషా, సత్యవతి, వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి ,కృష్ణవేణి, స్కావెంజర్స్ యూనియన్ నాయకురాలు మహాలక్ష్మి, సుశీల, శ్రీదేవి,షేక్ మున్ని, చిట్టెమ్మ, విజయ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రాజేశ్వరపురం టీచర్ బీ.కల్పన సూచించారు. రాజేశ్వరపురం లో బుధవారం అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం ను నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రుల తో సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడేళ్లు దాటిన పిల్లలను గుర్తించి వారి ఇళ్లను సందర్శించి కేంద్రాలలో చేరాలని కోరుతున్నట్లు తెలిపారు. 5 ఏళ్లు దాటిన చిన్నారులను పాఠశాలలో చేర్పించనున్నట్లు పేర్కొన్నారు. గువ్వలగూడెం లో ఏసీడీపీవో రత్నకుమారి, సూపర్వైజర్ నాగమణి, టీచర్లు పుష్ప, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# టూ వీలర్‌పై బడిబాట ప్రచారం

**-ప్రత్యేకంగా అభినందించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** టూ వీలర్ వాహనంపై బడిబాట కార్యక్రమానికి సంబంధించి ప్రచారం నిర్వహిస్తున్న కల్లూరు మండలం చెన్నూరు గ్రామ ఎంపిపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం కల్లూరు మండలం ఓబుల్‌రావు బంజర గ్రామంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పర్యటించి మూతపడిన ప్రాథమిక పాఠశాలను పునః ప్రారంభించి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డుపై టూ వీలర్ వాహనం ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌ను గమనించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మఒడి, ప్రభుత్వ బడి, మీ పిల్లలను మీ ఊరి ప్రభుత్వ బడిలోనే చేర్పించండి అనే మంచి నినాదంతో వినూత్న రీతిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది పిల్లలు చేరేలా చూడాలని కలెక్టర్ సూచించారు.

# నేటి నుండి బడులు ప్రారంభం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు నేడు గురువారం ప్రారంభం కానున్నాయి. బుధవారం నుండి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పాఠశాలలను శుభ్రపరిచారు. పాఠశాల గదులను, వంటశాలలను, పాఠశాలల్లోని పారిశుధ్య పనులను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పాఠశాలలను శుభ్రపర్చినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలు ప్రారంభం సందర్భంగా అన్ని పాఠశాలలను ఉపాధ్యాయులు, పాఠశాలల పేరెంట్స్ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు.

# విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి

**-పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎల్.రమేష్**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గురుకుల పాఠశాలలో చేరే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎల్.రమేష్ సూచించారు. మండలంలోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ను, బుధవారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. గురుకుల పాఠశాల ఆవరణ అంతా కలియ తిరిగారు. అడ్మిషన్ల గురించి ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు గురుకులం లోకి వచ్చే సమయం కు అన్ని సిద్దంగా ఉండాలని అన్నారు. పారిశుద్ధం పట్ల అప్రమతంగా ఉండాలని అన్నారు. శానిటేషన్, వంటలు, కూరగాయల కు సంబంధించిన కమిటీ సమావేశాలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మోనూ లో నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. గురుకులాలలో ఉంటున్నవిద్యార్థులకు ఇంట్లోనే ఉన్నట్లు భావన కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య, గురుకుల పాఠశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచాలి

**ప్రతిభ చూపిన వారికి సన్మానాలు చేస్తాం**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** విద్యార్థుల ప్రవేశాల సంఖ్య ను పెంచాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు సూచించారు. మండల కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజనం వర్కర్స్, స్వచ్ఛ మిత్ర లకు బుధవారం అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల సంఖ్య ను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వ బడిని బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు సమిష్టి కృషి అవసరం ఉన్నారు. ఎక్కువగా విద్యార్థులను చేర్పించిన వారిని గుర్తించి సన్మానం చేస్తామని అన్నారు. మధ్యాహ్నం భోజనం లో ఎలాంటి లోటు పాట్లు లేకుండా విద్యార్థులకు రుచికరమైన భోజనం ను అందించిన ఏజెన్సీ లకు, అదే విధంగా పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచిన స్వచ్ఛ మిత్రులకు ఆగను 15 న ఘనంగా సన్నానం చేసామని అన్నారు. విధుల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించి ప్రభుత్వ పాఠశాలలను, నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సమావేశంలో సీఆర్పీలు ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మధ్యాహ్నం భోజనం వర్కర్స్, స్వీపర్స్ తదితరులు పాల్గొన్నారు.

# అమాయక ఆదివాసీలపై యుద్ధం ప్రకటించిన మోడీ, షా



**-రాజ్యాగాన్ని ఉల్లంగిస్తున్న కేంద్రం చర్యలని ఎండగట్టాలి**
**-ఆపరేషన్ కగార్ ముమ్మాటికీ రాజ్యాంగ ఉల్లంఘనే**
**-హత్యాకాండను నిలిపివేసి తక్షణమే శాంతి చర్చలు జరపాలి**
**-వామపక్ష, విపక్షాల సదస్సులో నేతలు**



**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ :** మధ్యభారతంలోని అమాయక ఆదివాసీ గిరిజనులపై ప్రధాని మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా యుద్ధం ప్రకటించి హత్యాకాండకు పాల్పడుతోందని, ఈ చర్యలను దేశ ప్రజలు ముక్తకంఠంతో కండించాలని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, న్యూ డిమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సీపీఎం జిల్లా నాయకులు రేపాకుల శ్రీనివాస్,టిజెఎస్ జిల్లా నాయకులూ మల్లెల రామనాథం, మాస్ లైన్ జిల్లా నాయకులు జాటోత్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు గౌస్ పాషా, బిఆర్ఎస్ జిల్లా నాయకులు అనుదీప్, బిఎస్పి జిల్లా నాయకులు కురుమళ్ల శంకర్, టిపిఎఫ్ జిల్లా నాయకులు ప్రశాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం శేషగిరిభవన్ లో జరిగిన వామపక్ష, విపక్షాల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో నాయకులు మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని, ఆదివాసీ చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఉల్లంగించి ఆపరేషన్ కగార్ పేరుతో దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోందని, అమాయక ఆదివాసీ బిడ్డలను పొట్టనపెట్టుకుంటోందని ఆరోపించారు. దేశ రక్షణకోసం సరిహద్దుల్లో ఉంచాల్సిన సైనికులను ప్రజలకోసం పోరాడుతున్న మావోఇస్టులపైకి ఉసిగొల్పుతూ హత్యలకు ప్రేరేపిస్తోదని విమర్శించారు. 2026 నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని అమిత్ షా ప్రకటించడాన్ని దేశ ప్రజలు కోరుకోవడం లేదని, పేదరిక నిర్మూలన, పూర్తి స్థాయిలో విద్య, వైద్యం, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని బాధ్యతగా కేంద్ర పాలకులు ప్రకటిస్తే ప్రజలు స్వాగతిస్తారని అన్నారు. అటవీ ప్రాంతంలో ఖనిజ సంపదకు కాపలాదారులుగా ఉన్న గిరిజనులను, మావోయిస్టులను మట్టిబెట్టి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఆపరేషన్ కగార్ కు కేంద్రం తెరలేపిందని ఆరోపించారు. తక్షణమే ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న హత్యాకాండకు స్వస్తి చెప్పి శాంతి చర్చలను కేంద్రం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. గౌని నాగేశ్వర రావు, కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, భూక్యా శ్రీనివాస్, కె రత్నకుమారి, ఫహీమ్, కె.ఉమర్, కల్తీ వెంకటేశ్వర్లు, సతీష్, గోపాల్ రావు, దేవదానం, భూక్యా రమేష్, కృష్ణయ్య, సంజీవ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన నిరంతరం పోరాడేది సిపిఐ

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు**




**ప్రజాపక్షం/కొణిజర్ల :** గత వంద సంవత్సరాలనుంచి నిరంతరం పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడేది సిపిఐ మాత్రమేనని సిపిఐ రాష్ట్ర సమితి సబ్యులు యర్రా బాబు అన్నారు. మండల పరిదిలోని కొత్త కాచారంలో సిపిఐ గ్రామశాఖ మహాసభ బండారుపల్లి భాస్కర్‌రావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడుతు కూడు, గుడ్డ నినాదంతో దళిత, గిరిజనులు, పేదలు బడుగు బలహీన వర్గాలకోసం భూపోరాటాలు నిర్వహించి లక్షల ఎకరాలు భూమి లేని నిరుపేదలకు పంచిన ఘనత సిపిఐకే దక్కిందని అన్నారు. నేటి పాలకులు అవలంబిస్తున్న విధానాలవలన ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని తెలిపారు. సమాజంలో ఆర్థిక దోపిడి ఎక్కవయిందని తెలిపారు. వచ్చే డిశంబర్‌కు పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మునిగె కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మోదుగు చిన్నవెంకటి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తకాచారం గ్రామశాఖ నూతన కార్యదర్శిగా తేళ్లూరి రాములును, సహాయ కార్యదర్శిగా కన్నయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# వైరా మండలంలో మూతపడనున్న పాఠశాలలు..!?

**-ఇప్పటికే మూతబడ్డ గౌండ్లపాలెం పాఠశాల**
**-అష్ణగుర్తి పాఠశాలలో ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు లేరు**
**-బడిబాటలో కనిపించని మార్పు**


అష్ణగుర్తి పాఠశాల


గౌండ్లపాలెం పాఠశాల

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని అష్ణగుర్తి పాఠశాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారిపోయింది. ఈ పాఠశాలలో విద్యార్థులు చేర్పించేందుకు అక్కడ పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు గ్రామస్థులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించిన ఎలాంటి స్పందన కనిపించలేదని ఆరోపణ వినిపిస్తున్నాయి. నేటి నుండి పాఠశాల తెరుచుకోనున్న నేపద్యంలో అష్ణగుర్తి పాఠశాలలో విద్యార్థులు వస్తారా రారా అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. మూసివేత దిశగా వైరా మండలంలో రెండు పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటికే గౌండ్లపాలెం గ్రామంలో సుమారు మూడు సంవత్సరాల నుండి ఇక్కడ పాఠశాల మూసి వేయడం జరిగింది. ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులను కూడా వేరే ప్రాంతానికి పంపించడం జరిగింది. కాని బడిబాట కార్యక్రమం నిర్వహించడానికి కూడా అక్కడ ఎలాంటి స్పందన రాలేదని తెలుస్తుంది. అదేవిధంగా అష్ణగుర్తి గ్రామం పాఠశాలల ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ గ్రామంలో పిల్లలు ఎవరు ఆ పాఠశాలలో చదువుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ఉపాధ్యాయులు ఉన్నారు తప్ప ఈ పాఠశాలలో విద్యార్థులు లేరు. అయితే గ్రామంలోని ప్రజలు తమ ఊర్లోని పాఠశాల మూతపడకుండా ఉండేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయి. లేదా అనేది నేటితో తెలియుంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం పదేపదే చెబుతూ ఉంది. అందులో భాగంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాల బలోపేతం చేసేందుకు అందరు ముందుకు రావాలని అవగాహన ఏర్పాటు చేసిన కూడా స్పందన లేకపోవడం బాధాకరం. వైరా మండలంలో రెండు ప్రభుత్వ పాఠశాలలు మూత దిశగా ఉన్నాయి.

# అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న సింగరేణి అధికారులు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని రైతు బజార్ ఏరియాలో సింగరేణి స్థలంలో అనుమతి లేకుండా వ్యాపారస్తులు కూరగాయల దుకాణాల కోసం అక్రమంగా ఎటువంటి అనుమతులు తీసుకోకుండా జేసీబీతో త్రవ్వకాలు మొదలుపెట్టగా ఎస్టేట్ సెక్యూరిటీ సిబ్బంధి అడ్డుకొన్నారు. ఈ సందర్భంగా ఎస్టేట్ అధికారులు సెక్యూరిటీ సిబ్బంధి సంబందిత కూరగాయల వ్యాపారస్తులతో సింగరేణి స్థలములలో ఎస్టేట్ అధికారుల అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే నిర్మాణ పనులు మొదలు పెట్టాలని, అలా కాకుండా ఎవరైనా అక్రమ నిర్మాణాలు కట్టినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అదే విధంగా అట్టి నిర్మాణాలను కూడా కూల్చివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎస్టేట్స్ అధికారులు మోహన్ రావు, సర్వేశ్, శ్రీనివాస్, భువనేశ్వరి, ఎస పిసి జూనియర్ ఇన్స్పెక్టర్ నారాయణరెడ్డి, జమేదార్ భాస్కర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# సిపిఐ పాల్వంచ మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/కొతగూడెం టౌన్ :** సిపిఐ పాల్వంచ మండల నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మండల పరిధిలోని పాండురంగాపురం లో జరిగిన సిపిఐ పాల్వంచ మండల 19వ మహాసభ జరిగింది వివిధ సమస్యలుపై చర్చించి డిమాండ్ల సాధనకు తీర్మానాలు చేశారు. అనంతరం నూతనంగా 91మందితో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా వీసంశెట్టి పూర్ణచందర్ రావు, సహాయ కార్యదర్శిగా గుండాల నాగరాజు లు తిరిగి ఎన్నిక అయ్యారు వారితో పాటు 39 మందితో కార్యవర్గం, 91 మందితో కౌన్సిల్ సభ్యులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కట్ల రంగారావుకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రేస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కట్ల రంగారావుని నాయిబ్రాహ్మణ సమైక్య సంక్షేమ సంఘం వైరా మండల కమిటీ సభ్యులు ఘనంగా శాలువాలతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. అనంతరం కట్ల రంగారావుకి శుభాకాంక్షలు తెలియజేశారు. సన్మానించిన వారిలో సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవరకొండ శ్రీను, కుదురుపాక శ్రీహరి, కేతవరపు నారాయణరావు, మండల అధ్యక్షులు కేతవరపు అశోక్, మంచికంటి అప్పారావు, శ్రీకాకుళం శ్రీరంగం, కుదురుపాక భాస్కర్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# వైరా మున్సిపాలిటీ వంద రోజులు ప్రణాళికలో శుభ్రత





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుభ్రత పరిశుభ్రత కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల, వసతిగృహాలు, డ్రైనేజీల్లో షిల్ట్, శానిటేషన్ కార్యక్రమాలను నిర్వహించారు. వైరా డంపింగ్ యార్డ్ నందు జేసిబితో డంపింగ్ ప్రాంతాన్ని శుభ్రపరిచారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చింతా వేణు మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో భాగంగా విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న నేపద్యంలో శుభ్రపరచడం జరిగిందని, డంపింగ్ యార్డ్ వద్ద దుర్వాసన రాకుండా శుభ్రపరచడం జరిగింది. వంద రోజుల ప్రణాళికలో భాగంగా రోజులు వారీగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైరా టౌన్ విద్యుత్ అధికారుల ఫోన్ నెంబర్లు మార్పు



**ప్రజాపక్షం/వైరా:** వైరా టౌన్ సెక్షన్‌లో ఉన్నటువంటి లైన్‌మెన్, ఏఈ ఫోన్ నెంబర్‌లు మారాయి. ఈ క్రింద కొత్త నెంబర్లు ద్వారా సంప్రదించగలరని వైరా విద్యుత్‌శాఖ ఏఈ సుందర్‌కుమార్ తెలిపారు. వైరా ఏఈ సుందర్ కుమార్ 8712483904, వైరా సబ్ స్టేషన్ నెంబర్ 8712483906. వైరా టౌన్ సిబ్బంది నెంబర్లు కె.శ్రీనివాసరావు, లైన్‌మెన్ 8712483902, బి.నెహ్రు, అసిస్టెంట్ లైన్‌మెన్ 8919960241, పి.సీతయ్య, లైన్ ఇన్స్పెక్టర్ 8712483901, ఎల్.సేతురావు, ఫోర్‌మెన్ 7842241846. సోమవరం, గండగలపాడు, స్టేజిపినపాక, కెజి సిరిపురం, ముసలిమడుగు, పూసలపాడు, స్నానాల లక్ష్మీ పురం గ్రామాల సిబ్బంది ఫోన్ నెంబర్‌లు పి.కృష్ణయ్య, లైన్‌మెన్ 8712483903, బి.వీరభద్రం, అసిస్టెంట్ లైన్‌మెన్ 8897787696. మారిన కొత్త నెంబర్లను ప్రజలు అవసరాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని సుందర్‌కుమార్ తెలిపారు.

# ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

**ప్రజాపక్షం/కల్లూరుః** ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని నమ్మకంతో తల్లిదండ్రులు పిల్లలను పంపించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు. కల్లూరు మండలం పరిధిలోని ఓబుల్ రావు బంజర్, పా యపూర్, లక్ష్మీ పురం గ్రామాలలో మూతబడిన పాఠశాలలను పున ప్రారంభించేందుకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఓబులరావు బంజర్ లో జరిగిన బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన పాఠశాలను కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఘనత ప్రభుత్వాన్ని దానిని పేర్కొన్నారు. మండలంలో మోతబడిన మూడు పాఠశాలల మౌలిక వసతులు అభివృద్ధి కొరకు రూ 10 లక్షల మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పండుగ వాతావరణం లో కలెక్టర్ పిల్లలతో కలిసి పాఠశాలను పున ప్రారంభించారు ప్రజలకు నాణ్యమైన విద్య అందించడం తమ బాధ్యతగా ప్రభుత్వం భావిస్తుందని పేర్కొన్నారు. డబ్బులు చెల్లించినప్పటికీ ప్రైవేటు వ్యవస్థలో నాణ్యమైన విద్య లభించడం లేదని కలెక్టర్ తెలిపారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు దక్కాలని దీనికి విద్యఒక్కటే మార్గమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజులలో ప్రహరీ గోడ, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పన పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మన పూర్వీకులు మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో చదివి గొప్ప స్థాయికి ఎదిగారని గత సంవత్సరం 10 ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల్లో 96% ఉత్తీర్ణత ఉంటే ప్రైవేటు పాఠశాలల్లో ఆ సంఖ్య కేవలం 91 శాతం మాత్రమే, మెరుగైన ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల్లో సాధిస్తున్నామని గుర్తు చేశారు. పాఠశాల మౌలిక వసతులకు గాను 10 లక్షలు చెక్కును ఆడియో కందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు పాఠశాల ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, పాఠశాలకు స్పోర్ట్స్, మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి తమకు కావలసిన సౌకర్యాలను ప్రతిపాదనలో అందించాలని అంగన్వాడీ సిడిపిఓ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, కల్లూరు ఆర్డిఓ రాజేందర్, ఎంపీడీవో చంద్రశేఖర్, తాసిల్దార్ పులి సాంబశివుడు, విద్యాశాఖ అధికారి నివేదిత, టిడిపివో సిహెచ్ నిర్మల జ్యోతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత, ఎ ఓ రంజిత్ కుమార్, కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



# రోబోటిక్‌ని రీప్లేస్‌మెంట్ విజయవంతం




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అడ్వాన్స్ అస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న 63 ఏళ్ల మహిళకు రోబోటిక్ టోటల్ ని రీప్లేస్‌మెంట్ విజయవంతంగా నిర్వహించినట్లు ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఉదయ్‌కృష్ణ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ ఉదయ్‌కృష్ణ మాట్లాడుతూ ఖమ్మంకు చెందిన 63 ఏళ్ల సత్యవతి జోనోబోయిన అనే మహిళకు దీర్ఘకాలికంగా రెండు మోకాళ్లలో తీవ్రమైన అస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడుతుందని తెలిపారు. మోకాళ్ల నొప్పులతో నడవడానికి ఇబ్బందులు పడుతూ సత్యవతి యశోద ఆసుపత్రికి వచ్చారని ఆయన తెలిపారు. ఆమెకు క్లినికల్ పరీక్షలు నిర్వహించగా రెండు మోకాళ్లలో అధునాతన అస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు గుర్తించామన్నారు. మే 10న తనతో పాటు కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ ట్రామా, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ రవీష్ అజ్మీరా ఆధ్వర్యంలో అధునాతన స్మిత్, నెఫ్యూ సివోఆర్ఐ రోబోటిక్ సిస్టంను ఉపయోగించి శస్త్రచికిత్స నిర్వహించినట్లు వారు తెలిపారు. ఉన్నతమైన మన్నిక, తక్కువ బరువు కలిగిన అక్సినియం ప్రోస్థసిస్ ఇంప్లాంట్‌ను ఈ సర్జరీలో ఉపయోగించినట్లు తెలిపారు.రోబోటిక్ కీళ్ల మార్పిడి, బోన్ కట్స్, అమరికలో గతంలో ఎన్నడులేనంత ఖచ్చితంగా చేయడానికి వీలుంటుందన్నారు. ఈ సర్జరీ కీళ్ల జీవిత కాలం, రోగి జీవనశైలి మెరుగుపర్చడంలో ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. సత్యవతి పూర్తిగా కోలుకుందని ఆమెకు సర్జరీ తర్వాత క్వాడ్రిస్సెప్స్, హామ్‌స్ట్రింగ్ బలోపేతం మోకాలు ఆర్‌వోఎం వ్యాయామం , వాకర్ సాయంతో నడవడం, ఫిజియోథెరపి వంటి సేవలను అందించామని తెలిపారు. ఆమె ఇప్పుడు లేచి నడవడమే కాకుండా పూర్తి ఆరోగ్యంగా ఉందని ఆమెను డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. యశోద ఆసుపత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా నాలుగు బ్రాంచీలు సికింద్రాబాద్, సోమాజిగూడ, మలక్‌పేటలో అన్ని సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అనుభవజ్ఞులైన వైద్యులచే, అధునాతన సాంకేతికతతో అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఇటువంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

## జాబ్‌మేళాలో 20 మంది ఎంపిక




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎస్ఆర్ అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 20 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. బుధవారం గ్రాడ్యుయేట్ ఎంప్లాయిూమెంట్ ఎక్స్చేంజ్ (గీత్), ఎస్ఆర్అండ్‌బిజిఎన్‌ఆర్ ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 38 మంది పాల్గొనగా వారిలో 20 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వి2ఐటి సోల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 17 మంది, జస్ట్ డయల్ కంపెనీకి ముగ్గురు ఎంపికైనట్లు కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డా॥ చింతా సుధాకర్ తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొన్న వారికి ప్రిన్సిపాల్ జాకీరుల్లా ఇంటర్వ్యూల్లో పాటించాల్సిన మేళకువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గీత్ కో ఆర్డినేటర్ ఫణీంద్రబాబు, టిఎస్‌కెసి మెంటర్ వేలాద్రి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కట్ల రంగారావుకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/వైరాః** పిసిసి ప్రధాన కార్యదర్శిగా నిన్న నియమితులైన కట్ల రంగారావుని వారి కార్యాలయం నందు వైరా మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. ప్రధాన కార్యదర్శిగా నియమితులైనందుకు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ నాయకులు గుడిమల్ల జ్ఞానరత్నం తోటకూర వీరబాబుయాదవ్, అరికట్ల వినయ్, కాజా , ఆంతోటి ఆనందరావు, గుండ్ల నర్సింహారావు, హరికృష్ణ, మల్లబోయిన సైదులు, ధర్మపురి రవితేజ, నవీన్, షేక్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి పాఠశాలలు పున : ప్రారంభం




**ప్రజాపక్షం/వైరాః** నేటి నుండి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. వైరా మండలంలో 48 పాఠశాలలు ఉంటే రెండ పాఠశాలలు మూతబడ్డాయి. 46 పాఠశాలలు నేడు తెరుచుకోనున్నాయి. ఆయా గ్రామాల్లోని పాఠశాలలో విద్యార్థులు చేర్పించేందుకు బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసే దిశగా చేసిన ప్రయత్నాలు ఫలితాస్తాయా లేదా అనేది నేడు తెలియనుంది. ఎందుకంటే ఉపాధ్యాయులు బడిబాటలో ఇంటికెళ్లిన సమయంలో తమ పిల్లలను పంపిస్తామని చెప్పిన పేరెంట్స్ నేడు పంపిస్తారా పంపించరా అనేది కూడా ఇప్పుడు ఒక చర్చ ఉపాధ్యాయులు నడుస్తుంది.ఏది ఏమైనా నేటి నుంచి ప్రారంభం కానున్న విద్యాసంస్థలు ఏ విధంగా ముందుకు సాగుతాయో మౌలిక వసతులు సాధన ఏ విధంగా ఉంటుందో బడిబాటలో భాగంగా ఎంతమంది విద్యార్థులు పాఠశాలకు వస్తారు వేచిచూడాల్సిందే.

# విద్యుత్ అధికారుల సేవలకు సెల్యూట్..!

**ప్రజాపక్షం/కరకగూడెంః** మండల పరిధిలోని ఒకే విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిల్లో సిబ్బంది కొరత ఉండటంతో, కష్టపడి చదివి ప్రజలకు మేలు చేయాలని విద్యుత్ లైన్మెన్ గా నరసింహారావు విధులు నిర్వహిస్తున్నారు. విద్యుత్ సరఫ రాలో కీలకంగా వ్యవహరించే క్షేత్రస్థాయి సిబ్బందిలో కరకగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ ఇన్స్పెక్టర్ (1) సిబ్బంది కొరతతో ఆన్ డ్యూటీ వర్కర్లతో సతమతమవుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.

**కరెంట్ సమస్యా..? తక్షణమే పరిష్కారం...**

అత్యవసర శాఖల్లో విద్యుత్ శాఖ కూడా ఒకటి. క్షేత్రస్థాయిలో లైన్ మెన్లు, ఇతర సిబ్బందికి చాలా పని ఉంటుంది. కరెంట్ పోయిందని ఏ సమయంలో వినియోగదారుల నుంచి సమాచారం వచ్చినా తక్షణమే స్పందిస్తారు. విద్యుత్ లైన్లు తెగిపోయినా, స్తంభాలు పడిపోయినా, లైన్లకు చెట్ల కొమ్మలు అడ్డుపడినా, ట్రాన్స్ ఫార్మర్లలో ఫ్యూజ్ సమస్యలు తలెత్తినా, హై ఓల్టేజ్ లో ఓల్టేజ్ సమస్యలు ఏర్పడినా వెంటనే స్పందిస్తారు. మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరిస్తుంటారు. లైన్లు తెగిన సమయంలో ప్రాణాలకు తెగించి సిబ్బంది స్తంభాలు ఎక్కి మరమ్మతులు చేస్తుంటారు. ఈ సమయంలో ఒక్కోసారి ప్రమాదవశాత్తు కింద పడిపో వడం, ఇతర విద్యుత్ ఫీడర్ నుంచి సరఫరా అవడంతో ప్రమాదాల బారిన పడుతుంటారు. మరి కొందరు తీవ్రంగా గాయపడిన మంచానికే పరిమితమయ్యారు. ప్రమాదం పొంచి ఉందని తెలిసినా సిబ్బంది చాలా ధైర్యంగా పగలు, రాత్రి, ఎండ, వానను పట్టించుకోకుండా ఎంత కష్టమైనా పని చేస్తారు. వర్షాకాలం గడియ గడియ గండమే. ప్రధానంగా వర్షాకాలంలో విద్యుత్ సిబ్బంది పని చాలా కష్టతరంగా ఉంటుంది. తుఫాన్లు, వరదలు విపత్కర పరిస్థితులు తలెత్తితే రోజుల తరబడి ఇంటి ముఖం చూసే అవకాశం ఉండదు. దెబ్బతిన్న లైన్లు, కొత్త స్తంభాల ఏర్పాటు పనుల్లో పూర్తిగా నిమగ్నమై సరఫరా పునరుద్ధరణకు శ్రమిస్తుంటారు. అలాగే ఇతర తుపాన్లు, వరదలు వస్తే ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్కడికి వెళ్లి పనులుచేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

**మండల కేంద్రంలో కాసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోతే చాలు వెంటనే లైన్‌మెన్‌కు ఫోన్ చేసి అన్నా.. కరెంట్ ఎప్పుడొస్తుంది..? అని చాలామంది అడుగుతుంటారు. మనిషి జీవితంలో కరెంట్ ఒక భాగమైపోయింది. విద్యుత్ ఉంటేనే చాలా పనుల వుతున్నాయి. ఒక్కోసారి వివిధ కారణాలతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతూ ఉంటుంది. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ విధుల్లో ఉంటూ వెంటనే పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్న జూనియర్ లైన్మెన్ నరసింహారావు. వీరి ఉద్యోగం చాలా కష్టతరమైంది. విద్యుత్‌కు సంబంధిన ఫిర్యాదుల కొరకు ప్రజలను ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించి నెరవేస్తున్న విద్యుత్ అధికారి**

**ఫోన్ వస్తే వెంటనే స్పందించాలి : జూనియర్ లైన్మెన్ నరసింహారావు**

ఇంటికి వచ్చి అన్నం తినే సమయంలో కరెంట్ పోయిందని ఫోన్ వస్తే మధ్యలో వెళ్లిపోయి సమస్యను తీర్చిన సందర్భాలు న్నాయి. రాత్రి నిద్రపోతున్న సమయంలో ఫోన్ వస్తే వెంటనే వెళ్లి ఏ ప్రాంతంలో ఏ ట్రాన్స్ ఫార్మర్ పరిధిలో విద్యుత్‌కు అంతరా యం కలిగిందో గుర్తించి మరమ్మత్తులు చేసి వస్తాం. కొన్ని సందర్భాల్లో కంటి నిండా నిద్ర సమయం, కడుపు నిండా తిండి తినే అవకాశం ఉండదు. కుటుంబ సభ్యులతో సరదాగా బయటకు వెళ్తే కరెంట్ పోయిందని ఫోన్ వస్తే వెంటనే వచ్చేయాలి. వినియోగదారులకు సేవలు అందించినప్పుడే మాకు సంతృప్తికరంగా ఉంటుంది.




జూనియర్ లైన్‌మెన్ నరసింహారావు